సాక్షి జనగామ

గురువారం । 10 । ఆగస్టు । 2023



డిగ్రీ.. నో డిమాండ్

కేయూ పరిధిలో వివిధ రకాల డిగ్రీ కోర్సులు ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరం డిగ్రీ మొదటి సంవత్సరంలో 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. - 8లో▸



స్కూల్ బస్సును ఢీకొన్న జెడ్పీఫ్లోర్ లీడర్ వాహనం

ఆగి ఉన్న స్కూల్ బస్సును వరంగల్ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న వాహనం ఢీకొని ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33^0 / 25^0

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి.

న్యూస్‌రీల్

నోటరీ డాక్యుమెంట్ల క్రమబద్ధీకరణ

జనగామ: పట్టణంతో పాటు అర్బన్ ఏరియాల పరిధిలో నోటరీ డాక్యుమెంట్లు ఉన్న యజమానులు రెగ్యులరైజ్ చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి కలెక్టర్ శివలింగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీసేవ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తామని, నోటరీ, లింక్ డాక్యుమెంట్లు, ఆస్తి పన్ను రశీదు, విద్యుత్, వాటర్ బిల్లు, ఇతర డాక్యుమెంట్లు సమర్పించాలన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై తనిఖీ

జనగామ: పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ అమ్మకాలపై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు ఆధ్వర్యంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాల్లో ప్లాస్టిక్ విక్రయాలను గుర్తించి జరిమానా విధించారు. ఇక నుంచి నిత్యం తనిఖీలు ఉంటాయని, ప్లాస్టిక్ కవర్లు ఉన్న దుకాణ యజమానికి రూ.500, కొనుగోలు చేసిన వారికి రూ.100 జరిమానా వేస్తామని హెచ్చరించారు.

నిబంధనలు పాటించాలి

జనగామ : రోడ్డుపై ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ ఆర్టీఏ నిబంధనలు పాటించాలని డీసీపీ సీతారాం అన్నారు. ఆర్టీసీ చౌరస్తాలో బుధవారం ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీలను ఆయన పరిశీలించారు. నిబంధనలు పాటించని పలువురికి జరిమానా విధించారు.

వీఆర్‌ఏలకు పోస్టింగ్

జనగామ: ఇటీవల ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయగా బుధవారం వారికి ఆయా శాఖల వారీగా పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ శివలింగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్, నీటి పారుదల తదితర శాఖలకు కేటాయించారు. కాగా 46 మంది వీఆర్‌ఏలను హైదరాబాద్, సిద్దిపేట, మల్కాజిగిరి, మేడ్చెల్, సిద్దిపేట జిల్లాలకు పోస్టింగ్ ఇచ్చారు.

డిగ్రీ అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్

జనగామ రూరల్: శామీర్‌పేటలోని గిరిజన సంక్షేమ బాలికల డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హరిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి 20 వరకు పేర్లు నమోదు చేసుకుని సంబంధిత సర్టిఫికెట్లతో కళాశాలకు రావలని సూచించారు. బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల్లో సీట్లు ఉన్నాయని, మరిన్ని వివరాలకు 99496 98695, 93980 51182 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏర్రోజు రామస్వామి అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, ప్రతి జిల్లాకు ఈహెచ్‌ఎస్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజయ్య, వీరన్న, మల్లారెడ్డి, లక్ష్మయ్య, ఆనందం, యాదగిరి, చంద్రారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

చేర్యాలకు జూనియర్ సివిల్ కోర్టు



జనగామ: చేర్యాల మున్సిపాలిటీకి జూనియర్ సివిల్ కోర్టు మంజూరైయిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెండురోజుల క్రితం సీఎం కేసీఆర్‌ను కలిసి చర్చించిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పేర్కొన్నారు. కోర్టుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కాపీలను ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ప్రజలకు అంకితం చేసినట్లు చెప్పారు. అనంతరం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

ఆంక్షలు తొలగించాలి

జనగామ రూరల్: ఉపాధ్యాయుల భవిష్య నిధిపై ఉన్న ఆర్థిక ఆంక్షలు వెంటనే తొలగించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన జెడ్పీ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అవసరాలకు దాచుకున్న జీపీఎఫ్ డబ్బులు రాక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారు ఏళ్ల తరబడి డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కె.యాదగిరి, అశోక్, శ్రీరామ్, వజ్రయ్య, అంకుషావలి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ గణన షురూ

మొబైల్ యాప్ ద్వారా మూడు దశల్లో..

- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా సర్వే
- ఈసారి వ్యవసాయ కమతాల గుర్తింపు
- 10 అంశాల వారీగా వివరాల సేకరణ

జనగామ: జిల్లాలో 11వ వ్యవసాయ గణన కార్యక్రమం ప్రారంభమైంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి వ్యవసాయ గణనను నిర్వహించాల్సి ఉండగా, చివరిసారిగా 2015–16లో పూర్తి చేశారు. కరోనా కారణంగా 2021–22లో గణన వాయిదా పడగా.. ఈసారి మాన్యువల్‌గా కాకుండా మొబైల్ యాప్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టారు. అలాగే వ్యవసాయ కమతాలను గుర్తించాలని మొదటిసారిగా నిర్ణయించారు. మూడు దశల్లో చేపట్టే ఈ గణన మొదటి దశలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బందికి కలెక్టర్ సమావేశ మందిరంలో బుధవారం ఏఓ, ఏఈఓ, మండల ప్రణాళిక గణాంక అధికారులకు ప్రత్యేక యాప్ ద్వారా కమతాలను గుర్తించే విధానంపై శిక్షణ ఇచ్చారు. ఈనెల 25వ తేదీ లోపు గణన పూర్తి చేసే విధంగా దిశా నిర్దేశం చేశారు.

98 మందికి బాధ్యతలు

జిల్లాలో 176 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. ప్రతి రెవెన్యూ గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని వ్యవసాయ గణన చేపట్టనున్నారు. మొదటి దశలో రైతు పేరుతో పాటు సామాజిక స్థితి, భూమి విస్తీర్ణం వివరాలు, వ్యక్తిగత సాగు, ఉమ్మడి సాగు, సంస్థాగత సాగు, పురుషులు, మహిళలు, ట్రాన్స్ జెండర్ల వారీగా వివరాలు తీసుకుంటారు. ఈ గణనకు కలెక్టర్ చైర్మన్, ముఖ్య ప్రణాళిక అధికారి కన్వీనర్, వ్యవసాయ, పశుగణన, హార్టికల్చర్, నీటిపారుదల జిల్లా అధికారులు సభ్యులుగా పర్యవేక్షిస్తారు. గణన నిర్వహించడానికి 98 మంది సిబ్బందికి బాధ్యతలను అప్పగించారు. ఇందులో క్షేత్ర స్థాయిలో 62 మంది వ్యవసాయ విస్తారణాధికారులు పని చేయనున్నారు. అలాగే 12 మంది ఏఓలు ఇన్‌చార్జ్‌లు, ఒక ఉప గణాంకాధికారి, 24 మంది మండల ప్రణాళిక గణాంక అధికారులు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షకులుగా వ్యవహరిస్తూ సాంకేతిక సలహాలు అందిస్తారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఓ, డీఏఓ

జిల్లాలో 2015-16 సంవత్సరం 10 అంశాల్లో నిర్వహించిన వ్యవసాయ గణన వివరాలు

రైతులు	పురుషులు	మహిళలు	మొత్తం
సన్నకారు	73,595	14,440	88,035
చిన్నకారు	23,959	5,447	29,406
పాక్షికం	9,906	1,931	11,837
మీడియం	2,866	436	3,302
పెద్ద రైతులు	205	19	224
మొత్తం	1,10,531	22,273	1,32,804



సాంకేతికతతో సర్వే..

తాజాగా అమలు చేస్తున్న వ్యవసాయ గణనలో వంద శాతం సాంకేతికతను సద్వినియోగం చేసుకోనున్నారు. స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ విధానంలో వ్యవసాయ కమతాలు, రైతుల వివరాలు సేకరించనున్నారు. ఇప్పటికే 'రైతుబంధు' పథకానికి రైతుల నుంచి ఆధార్ కార్డులు, వ్యవసాయ భూముల విస్తీర్ణం, పంటల సాగు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందు పరుచగా, వాటి ఆధారంగా వ్యవసాయ గణనలో అదనపు సమాచారాం తీసుకుంటారు. దేశ వ్యాప్తంగా వ్యవసాయ గణనను మాన్యువల్‌గానే నిర్వహిస్తుండగా.. తెలంగాణ రాష్ట్రంలోనే మొదటిసారిగా సాంకేతికతను ఉపయోగించి గణన చేపట్టనున్నారు. ప్రత్యేక యాప్ ద్వారా స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లను ఉపయోగించి, పూర్తి వివరాలను అందులో పొందు పరుస్తారు.

25 లోపు గణన పూర్తి చేయాలి

సీపీఓ ఇస్మాయిల్, డీఏఓ వినోద్‌కుమార్

వ్యవసాయ గణన కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ లోపు పూర్తి చేయాలని సీపీఓ ఇస్మాయిల్, డీఏఓ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఏఓ, ఏఈఓ, మండల ప్రణాళిక గణాంక అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జిల్లాలో 2015–16లో 10వ వ్యవసాయ గణన వివరాల సేకరణ సమయంలో చిన్న, సన్నకారు, పాక్షిక, మధ్యస్థ, పెద్ద రైతులు(పురుషులు, స్త్రీలు) 1,32,804 ఉన్నారని చెప్పారు. ఇప్పుడు ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని, పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా 'కొమ్మూరి'

- ఏఐసీసీ నుంచి ఉత్తర్వులు జారీ
- పార్టీ శ్రేణుల్లో సంబురాలు



జనగామ: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మెంబర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని నియమిస్తూ బుధవారం రాత్రి ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన జంగా రాఘవరెడ్డి, వరంగల్ పశ్చిమకు వెళ్లడంతో.. ఇక్కడ ఖాళీ అయింది. నాలుగు నెలల ఉత్కంఠతకు తెరదింపుతూ కొమ్మూరిని జిల్లా అధ్యక్షుడిగా ప్రకటిస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ ఆర్డర్ కాపీ ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు పంపించిన రెండు గంటల్లోనే ఏఐసీసీ నుంచి జిల్లా అధ్యక్షుడి నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో కాంగ్రెస్ శ్రేణుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. 2018 నవంబర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరిన కొమ్మూరి.. 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా నుంచి పోటీ చేశారు. గత ఏడాది టీపీసీసీ మెంబర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన.. జనగామ నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధి విషయంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్ష పదవి రావడంతో.. ఆయనపై మూడు అసెంబ్లీ నియోజకవర్గాల బాధ్యత పెరిగింది. తన నియామకానికి సంహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రతాప్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పేరు	: కొమూరి ప్రతాప్‌రెడ్డి
ఊరు	: నర్సాయపల్లి
పుట్టిన తేదీ	: 1958 జనవరి 2
విద్యార్హతలు	: ఎంఏ, ఎల్‌ఎల్‌బీ(సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్రటరీ, జీఏడీ ఉద్యోగం నుంచి వీఆర్‌ఎస్ తీసుకున్న తర్వాత, అగ్రికల్చర్, సోషల్ సర్వీస్, బిల్డింగ్ అడ్వైజర్‌గా సేవలందించారు)
ఎమ్మెల్యే	: ఒకసారి
భార్య	: అరుణ
పిల్లలు	: ఇద్దరు కుమారులు, కూతురు

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి నర్మద

జనగామ: మహిళలు, బాలికలు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జనగామ కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సీహెచ్.నర్మద అన్నారు. మహిళలు, బాలికల చట్టాలపై బుధవారం సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇ.విక్రమ్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు, బాలకార్మిక చట్టాలు, అదనపు కట్నం వేధింపులు, గృహహింస చట్టాలు, మహిళల సంపూర్ణ ఆరోగ్యానికి అందిస్తున్న పౌష్టికాహారం అంశాలు తెలిసి ఉండాలని చెప్పారు. ఎలక్ట్రానిక్ మాధ్యమాలను ఉపయోగించే విధానంతో పాటు మనకు మనం రక్షించుకోవాలనే దానిపై అప్‌డేట్ కావాలని సూచించారు. కష్టపడి చదువుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సమస్యలు వచ్చిన వెంటనే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇట్టబోయిన జ్యోత్స్న పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి నర్మద

ఉద్యోగులకు క్రీడా పోటీలు

జనగామ రూరల్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్, ఇతర ఉద్యోగులకు ఈనెల 11న క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి గోపాల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మినీ స్టేడియంలో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్, క్రికెట్, ఫుట్‌బాల్ తదితర 17 క్రీడల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

గృహలక్ష్మి పథకానికి నేడు చివరి గడువు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

జనగామ రూరల్ : 'గృహలక్ష్మి' పథకానికి గురువారం(నేడు) లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. గృహలక్ష్మి పథకానికి గ్రామాల వారు మండల పరిషత్ కార్యాలయంలో, పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో ఆధార్, రేషన్ కార్డు, స్థలానికి సంబంధించిన పత్రాలు, బ్యాంక్ ఖాతా నంబర్ వివరాలతో దరఖాస్తు అందజేయాలన్నారు. అలాగే బీసీ వృత్తిదారుల ఆర్థిక సహాయం పథకం మొదటి విడత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మైనార్టీ శాఖ ద్వారా అందించే రుణాలతోపాటు 'దళితబంధు' రెండో దశ గ్రౌడింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్రూం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దామోదర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కోర్నెలియస్, బీసీ, మైనార్టీ సంక్షేమ అధికా రులు రవీందర్, ఇస్మాయిల్, డీఏఓ వినోద్‌కుమార్, ఏఓ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

జనగామ: రానున్న ఎన్నికల విధులను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, సుహాసిని, డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక అధికారులను నియమించామని, క్షేత్రస్థాయిలో పోలింగ్ బూతులను పరిశీలించడంతో పాటు ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలన్నారు. పోలింగ్ సిబ్బంది, బూతు లెవల్ అధికారులకు శిక్షణ ఇవ్వడానికి మాస్టర్ ట్రైనర్లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఓటరు నమోదు కార్యక్రమం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపు తదితరాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దిగుబడికి తగినట్టుగా ఎగుమతులు

- రవాణా ఏర్పాట్లకు రైల్వే శాఖ చర్యలు
- గూడ్స్ వ్యాగన్ పాయింట్‌కు రూ.8కోట్లు
- సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే.రెడ్డి
- రెండు జిల్లాల రైస్‌మిల్లర్స్‌తో సమీక్ష
- సమస్యలు ఏకరువు పెట్టుకున్న మిల్లర్లు

జనగామ: జిల్లాలో వచ్చే సీజన్ పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంది.. ఎగుమతులు సైతం రెట్టింపు అవుతాయి.. ఇందుకు తగినట్టుగా రైల్వే శాఖ రవాణా ఏర్పాట్లు చేస్తున్నదని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కేఆర్‌కే.రెడ్డి అన్నారు. బుధవారం జనగామ రైల్వేస్టేషన్ వెయిటింగ్ హాల్‌లో జనగామ, యాదాద్రి జిల్లాల రైస్‌మిల్లర్స్, ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయీస్, సౌత్ సెంట్రల్ ఫ్రైట్ సర్వీసెస్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఎస్.రమేష్ బాబు, సికింద్రాబాద్ ఏరియా ఆఫీసర్ మిథున్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ వి.జాన్‌బెస్టర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతనం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బాయిల్డ్ రైస్‌కు మాత్రమే ఎగుమతి అనుమతులున్నాయని, రా రైస్‌కు సైతం గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉందన్నారు. గూడ్స్ రవాణా పరంగా పురోగతి సాధించడంతో జనగామ షెడ్డును మాడ్రనైజేషన్ చేసేందుకు రూ.8కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా వంగపల్లి వరకు ఫేస్–2 లైన్‌కు ఆమోదం లభించడంతో అక్కడ నిర్వహణలో ఉన్న గూడ్స్ షెడ్డును తొలగించామని, ప్రత్యామ్నాయంగా జనగామ లేదా బీబీనగర్–నాగిరెడ్డిపల్లి మీదుగా సరుకు రవాణా చేసేలా మిల్లర్లతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

సమస్యలు వివరించిన మిల్లర్లు

ఎఫ్‌సీఐ గోదాంల నుంచి సీఎంఆర్ బియ్యం ఎగుమతి చేసే సమయంలో మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారి దృష్టికి తీసుకువచ్చారు. జనగామ, యాదాద్రి జిల్లాల రైస్‌మిల్లర్ల ప్రతినిధులు పజ్జూరి జయహరి, నాగభూషణం, వెంకటేష్, కానుగంటి ముత్తయ్య, దాసనర్సయ్య, మాశెట్టి అశోక్ తదితరులు సమస్యలతో పాటు భవిష్యత్ అవసరాలపై నివేదిక ఇచ్చారు. రెండు జిల్లాల నుంచి 25 లక్షల టన్నుల ధాన్యం ఎగుమతి చేయగలమని, సమయానుకూలంగా బియ్యం ఎగుమతికి సహకారం అందిస్తామన్నారు. గూడ్స్ వచ్చిన సమయంలో ట్రాఫిక్ సమస్యతో కొంత ఆలస్యమైతే ఫెనాల్టీ లేకుండా చూడాని కోరారు. జనగామ జిల్లా ఏర్పడిన తర్వాత ఎఫ్‌సీఐ, జిల్లా అధికారుల మధ్య సమన్వయ లోపంతో కొంత గ్యాప్ కనిపిస్తున్నదని, వచ్చే ఏడాది ధాన్యం ప్రైవేటు కొనుగోళ్లు పుంజుకుని కాకినాడకు ఎగుమతి పెరుగుతుందన్నారు. గోదాంల వద్ద లోడింగ్‌కు చాలా సమయం పడుతుండడంతో మిల్లర్లు నష్టపోవాల్సి వస్తున్నదని వివరించారు. వంగపల్లి గూడ్స్ వ్యాగన్ పాయింట్‌ను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం కేఆర్‌కే.రెడ్డిని మిల్లర్లు సత్కరించారు. సమావేశంలో మాశెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కేఆర్‌కే.రెడ్డిని సత్కరిస్తున్న మిల్లర్లు

అవినీతి లేని పాలన అందిస్తాం

- ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

రఘునాథపల్లి: నియోజకవర్గంలో అవినీతి లేని పాలన అందిస్తామని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. బుధవారం నిడిగొండలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రానుందన్నారు. స్టేషన్‌లో మళ్లీ గులాబీ జెండా ఎగురేద్దామని, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 100 పడకల ఆస్పత్రి కావాలని చేసిన విజ్ఞప్తి మేరకు మంజూరు చేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో కొన్ని సమస్యలు పరిష్కారం కాకపోవచ్చని, అయినా ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నామని పేర్కొన్నారు. యశ్వంతాపూర్ రైట్ కెనాల్ నుంచి నిడిగొండ ఊర చెరువులోకి గోదావరి జలాలు అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యశ్వంతాపూర్ నుంచి పడమటిగూడెం, తూర్పుగూడెంకు వారం రోజుల్లో బీటీ రోడ్డు మంజూరు కానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నుంచి పెద్దగోని శ్రీనివాస్ తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. మారుజోడు రాంబాబు, గొరిగ రవి, హుస్సెన్, బెజ్జంకి వెంకట్‌రెడ్డి, బొంగు ఐలయ్య, మైలారపు అంజనేయులు, చెంచు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కడియం శ్రీహరి


ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: గడిచిన 22 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరించాలని ఏఏహెచ్‌ఎం ల్యాబ్ టెక్నీషియన్ల యూనియన్ జిల్లా నాయకుడు రమేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత లేకుండా ఏళ్లతరబడి పనిచేస్తున్నామని, కరోనా కష్ట సమయంలో ప్రాణాలు లెక్కచేయకుండా సేవలందించామన్నారు. రెగ్యులరైజ్ చేసి పే స్కేల్, హెచ్ పాలసీలను, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళ టెక్నీషియన్లకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

యువత ప్రధాన పాత్ర పోషించాలి

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపులో యువత ప్రధాన పాత్ర పోషించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్ ఆధ్వర్యాన పార్టీ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ సర్కారు అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని యువతకు అన్యాయం చేస్తుండగా.. నిరుద్యోగ భృతి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సిద్దారెడ్డి, సర్వల నర్సింగరావు, దూడల సిద్ధయ్య, నర్సిరెడ్డి, మోట శ్రీనివాస్, బొట్ల నర్సింగరావు, జాయమల్లేశం, కడారు ప్రవీణ్, దాసరి క్రాంతి, పిడుగు రమేష్, బనుక ప్రభాకర్, మారబోయిన ప్రకాష్, పిట్టల సతీష్, ఎండీ.ముజ్జు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న కొమ్మూరి

ఆలయ భూముల రక్షణకు గెజిట్ పబ్లికేషన్

చిల్పూరు: ఆలయ భూముల రక్షణకు గెజిట్ పబ్లికేషన్ చేస్తున్నట్లు దేవాదాయ శాఖ యాదాద్రిభువనగిరి జోన్ నల్లగొండ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.మహేందర్‌కుమార్ అన్నారు. వరంగల్ దేవాదాయ శాఖ నుంచి జనగామ జిల్లా ఆలయాలు నల్గొండ దేవాదాయ శాఖలోకి చేరిన తర్వాత మొదటిసారి చిల్పూరుగుట్ట ఆలయ భూముల వివరాల సేకరణకు బుధవారం ఆయన ఇక్కడికి వచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం మహేందర్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో చిల్పూరు(బుగులు వెంకటేశ్వర స్వామి), పాలకుర్తి(సోమేశ్వరలక్ష్మీనరసింహస్వామి), నవాబుపేట(కోదండరామస్వామి, జీడికల్ (వీరాచల రమచంద్రస్వామి), కొడవటూరు(సిద్ధులగుట్ట శివాలయం) ముఖ్యమైన దేవాలయాలు కాగా.. జిల్లా కేంద్రంలోని చెన్నకేశ్వరస్వామి ఆలయం ఉందన్నారు. ఈ ఆలయాలకు సంబంధించి 1,270 ఎకరాల భూములు ఉన్నాయని, ఇవి ఆక్రమణకు గురికాకుండా గెజిట్ పబ్లికేషన్ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఈఓ లక్ష్మీప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహేందర్‌కుమార్

నాగరాజు హత్యకేసులో నలుగురిపై కేసు

- సెప్టిక్ ట్యాంకు నుంచి మృతదేహం వెలికితీత
- చేతులు, కాళ్లకు చీరతో కట్లు
- పథకం ప్రకారమే హత్య..?
- కొడుకులున్నా తలకొరివికి నోచుకోని వైనం

దేవరుప్పుల: మండల పరిధి కామారెడ్డిగూడెంలో హత్యకు గురైన రామిండ్ల నాగరాజు(45) మృతదేహాన్ని బుధవారం వెలికితీశారు. చేతులు, కాళ్లకు చీరతో కట్టి ఉండడంతో పథకం ప్రకారం హత్య జరిగినట్లు తెలుస్తోంది. కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన నాగరాజు కామారెడ్డిగూడెంలోని మేనమరదలును వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు. మంగళవారం రాత్రి నాగరాజును ఇంట్లోనే దారుణంగా హత్యచేసి సెప్టిక్ ట్యాంకులో పూడ్చిన విషయం తెలిసిందే. తెల్లవారు జామున మృతుడి సోదరుడు రామిండ్ల ఉపేందర్ చేరుకున్నాక మృతదేహాన్ని వెలికితీశారు. చేతులు, కాళ్లు కట్టేసి ఉన్నాయి. ఉపేందర్ ఫిర్యాదు మేరకు నాగరాజు భార్య శైలజ, అత్తమామలు చింత అబ్బసాయిలు, లచ్చమ్మ, నాగరాజు కొడుకు కిరణ్‌పై పోలీసులు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పాలకుర్తి సీఐ విశ్వేశర్ పర్యవేక్షణలో ఎస్సై శ్రవణ్‌కుమార్ గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.





విచారిస్తున్న ఏసీపీ సురేష్, నాగరాజు మృతదేహం

స్వగ్రామానికి మృతదేహం..

నాగరాజుకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కొడుకు డిగ్రీ ఫస్టియర్, కుమార్తెలు ఇంటర్, తొమ్మిదో తరగతి, చిన్న కొడుకు ఆరో తరగతి చదువుతున్నారు. ఆడపిల్లలు హాస్టల్‌లో ఉంటున్నారు. హత్య నేపథ్యంలో నాగరాజు భార్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబంతో ఉండే కొడుకులు అందుబాటులో లేరు. దీంతో కామారెడ్డిగూడెంలో అంత్యక్రియలు నిర్వహించాలనుకున్నా కుదరకపోవడంతో పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఏడునూతులకు తరలించారు. సోదరుడు ఉపేందర్ తలకొరివి పెట్టాడు. కాగా వర్ధన్నపేట ఏసీపీ సురేష్ హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి పూర్వాపరాలపై ఆరా తీశారు.

క్లుప్తంగా

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి



మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్ : దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఆ భూములను నిబంధనల మేరకు కౌలుకు ఇచ్చి వచ్చిన ఆదాయం బ్యాంక్‌లో జమచేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి. శ్రీకాంతారావు ఆదేశించారు. బుధవారం పాత సెంట్రల్ జైల్ ఎదుట గల దేవాదాయ శాఖ (ధార్మిక భవన్) కార్యాలయంలో ధూప దీపనైవేద్య పథకం ద్వారా లబ్ధిపొందుతున్న అర్చకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 200మంది అర్చకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంతారావు.. అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవాలయంలో సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, పర్యవేక్షకులు వీరస్వామి, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.



డిగ్రీ.. నో డిమాండ్

కేయూ డిగ్రీ కళాశాలల్లో సగం కూడా భర్తీ కాని సీట్లు

- 287 కళాశాలల్లో మొత్తం 98,980 సీట్లు
- 34,959 సీట్లు మాత్రమే భర్తీ.. 64,021 ఖాళీ
- ఇక స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీసీఏ, కంప్యూటర్ కాంబినేషన్‌లతో పాటు వివిధ రకాల కోర్సులు ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో 2023–2024లో ఆయా డిగ్రీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఇప్పటి వరకు మూడు దశల్లో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా సీట్లు కేటాయింపులు జరిగాయి. యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లల్లో సగం కూడా భర్తీకాలేదు. కేవలం 35శాతం మాత్రమే భర్తీ అయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కళాశాలలు కలిపి 267 ఉన్నాయి. అందులో వివిధ డిగ్రీ కోర్సులన్నీ కలిపి మొత్తం 98,980 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది మే నుంచి జూలై వరకు మూడు దశల్లో అడ్మిషన్ల ప్రక్రియ జరిగింది. మొదటి దశలో కేయూ పరిధిలోని కళాశాలలకు 16,078 సీట్లు కేటాయించగా అందులో 10,678 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత జరిగిన రెండోదశలో 11,112 సీట్లు కేటాయించగా 8,342 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఆ తరువాత మూడోదశలో 18,076 సీట్లు కేటాయించగా 15,939 మంది విద్యార్థులు కళాశాలల్లో చేరారు. మూడు దశల్లో నిర్వహించిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో మొత్తం 45,266 సీట్లు కేటాయించగా 34,959 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. కేవలం 35శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇంకా 64,021 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పెషల్ ఫేజ్‌కు అడ్మిషన్ల ప్రక్రియ షురూ..

రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకుగాను మూడు దశలు ముగిసినా వివిధ యూనివర్సిటీల పరిధిలో సీట్లు చాలా మిగిలాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి దోస్త్ ద్వారా స్పెషల్ ఫేజ్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియకు షెడ్యూల్ జారీ చేసింది. ఈ నెల 7వతేదీ నుంచి స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల ప్రక్రియ షురూ అయింది. ఈ నెల 13వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 14వ తేదీవరకు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవాలి. ఈనెల 17న సీట్లు కేటాయింపు జరగనుంది. స్పెషల్ ఫేజ్ నిర్వహించినా కూడా సీట్లు పూర్తిస్థాయిలో భర్తీ అయ్యే పరిస్థితి కనపడడంలేదు. ఇంటర్ పూర్తికాగానే ఎక్కువశాతం మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులతోపాటు దూర ప్రాంతాల రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. దీంతో సంప్రదాయ డిగ్రీ కోర్సులకు ఆదరణ తగ్గిపోతుంది. డిగ్రీలో కూడా పలు కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ వాటికి కూడా ఆదరణ అంతగా ఉండడం లేదనే సీట్ల భర్తీని బట్టి తెలుస్తోంది. మరోవైపు డిగ్రీలోనూ గురుకులాల సంఖ్య పెంపుదల చేశారు. దీంతో గురుకులాల్లో చేరడంతో ఆ ప్రభావం కూడా ఇతర కళాశాలపై పడిందని భావిస్తున్నారు. మరోవైపు గత విద్యాసంవత్సరంలో విద్యార్థులు అసలే లేని కళాశాలలకు ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దోస్త్‌లో కొన్నింటికి అవకాశం ఇవ్వలేదు. మరి కొన్నింటికి ఇచ్చారు. ఫలితంగా ఆయా కళాశాలల్లో సీట్లు భర్తీ ఈ విద్యాసంవత్సరంలోనూ అంతంత మాత్రమేనని సమాచారం.

మూడుదశల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో కేయూ పరిధిలో గత నెల 27నుంచే క్లాస్‌లు ప్రారంభమయ్యాయి. స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్లకు అవకాశం ఇచ్చినా అంతంతమాత్రమే సీట్లు భర్తీ అయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షం



బోనం ఎత్తుకున్న మంత్రి దయాకర్‌రావు

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు: గ్రామ దేవతల ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం డివిజన్ కేంద్రంలో జరిగిన బోనాల వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. బోనం ఎత్తుకుని మహిళలతో కలిసి ముత్యాలమ్మ గుడిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి నిరుద్యోగ యువతను మోసగించిందన్నారు. సీఎం కేసీఆర్ హామీ ప్రకారం 1.33 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశారని, 80 వేలకు పైగా ఖాళీలకు నోటిఫికేషన్లు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.152 కోట్లతో తొర్రూరు మున్సిపాలిటీని అభివృద్ధి చేయనున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, పట్టణాభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ పానుగోటి సోమేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాసరావు, దొంగరి రేవతి, నాయకులు కుర్ర శ్రీనివాస్, దొంగరి శంకర్, కర్నె నాగరాజు, జైసింగ్, పూలమ్మ పాల్గొన్నారు.

కేయూలో ఎస్‌ఎఫ్‌సీ విద్యార్థుల ధర్నా

- రెండోరోజూ కొనసాగింపు
- హాస్టల్ వసతి కల్పిస్తామని ప్రిన్సిపాల్, డైరెక్టర్ హామీ
- ఆందోళన విరమణ



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్‌ఎఫ్‌సీల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ రెండోరోజు కూడా బుధవారం ఉదయం 6 గంటల నుంచే గేట్ మూసివేసి ధర్నా చేశారు. మొదటి గేట్ మూసివేతతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దీనిపై సమాచారం అందుకున్న యూనివర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్ లాల్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వై వెంకయ్య మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఘటనా స్థలికి చేరుకున్నారు. వెంకయ్య మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో ఏ ఎస్‌ఎఫ్‌సీకి సంబంధించిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించలేదన్నారు. అయినా కొందరు నాన్‌బోర్డర్లుగా ఉండడం సరికాదన్నారు. అన్ని ఎస్‌ఎఫ్‌సీల విద్యార్థులకు మరో 15 రోజుల్లో హాస్టల్ వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా, ఆందోళనకు ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జ్ బొట్ల మనోహర్, బి రాకేష్ (ఎన్‌ఎస్‌యూఐ), మహేష్(పీడీఎస్‌యూ) తదితరులు మద్దతు తెలిపారు.

అవార్డు సాధనకు పోటీ పడాలి

- టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత
- 28 మంది ఉద్యోగులకు ప్రగతి చక్రాల పురస్కారం



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందజేసి సన్మానిస్తున్న ఆర్‌ఎం శ్రీలత

హన్మకొండ: అవార్డు సాధనకు ఉద్యోగులు పోటీ పడాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత అన్నారు. బుధవారం హనుమకొండలోని వరంగల్–1 డిపోలో వరంగల్ రీజియన్ స్థాయి ప్రగతి చక్రాల పురస్కార ప్రదానోత్సవం జరిగింది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన 28 మంది ఉద్యోగులకు ఆర్‌ఎం శ్రీలత నగదు అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపో, రీజియన్ స్థాయిలో కాకుండా రాష్ట్ర స్థాయి అవార్డు సాధించడంపై ఉద్యోగులు దృష్టి సారించాలన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఉద్యోగులు సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రభుత్వంలో విలీనంతో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. వరంగల్ రీజియన్ లాభాల్లో నడిచేలా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, ఈఈ భాస్కర్, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న ఉద్యోగుల వివరాలు...

వరంగల్–1 డిపో డ్రైవర్లు ఎ.రాజేందర్, టి.జె.సింగ్, కె.శ్యామ్, ఎం.శ్రీను, కె.వీరయ్య, భూపాలపల్లి డిపో డ్రైవర్లు కె.రాజేందర్, డి.కోటయ్య, పరకాల డిపో డ్రైవర్ టి.భిక్షపతి, వరంగల్–2 డ్రైవర్లు బి.పోచయ్య, ఎ.వెంకటయ్య, వరంగల్–2 డిపో కండక్టర్ బి.ఎస్.రావు, భూపాలపల్లి కండక్టర్ జి.సునీత, వరంగల్–1 డిపో కండక్టర్ జి.సుధాకర్, ఎస్.రమేష్, మహబూబాబాద్ కండక్టర్లు వీరన్న, వి.ఉమ, హనుమకొండ డిపో కండక్టర్లు ఎస్.రమేష్, ఎస్.కె.వై.పాషా, నర్సంపేట డిపో కండక్టర్లు బి.హరిసింగ్, బి.మహేందర్, టిమ్ డ్రైవర్లు కె.దినేష్‌కుమార్ (హనుమకొండ), టి.దేవేందర్ (హనుమకొండ), బి.సురేష్ (నర్సంపేట), ఎం.డి.షాహీద్ (నర్సంపేట), పి.ఆర్.రెడ్డి (నర్సంపేట), మెకానిక్‌లు టి.శంకరయ్య (వరంగల్–1), ఎం.సంజీవయ్య (వరంగల్–2), శ్రామిక్ ఎస్.సంపత్ కుమార్ (జనగామ) అవార్డులు అందుకున్నారు.



ఆయుర్వేద వైద్యకళాశాలలో అడ్మిషన్లకు అనుమతి

కాశిబుగ్గ: వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ విజయగణేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ కమిషన్ ఫర్ ఇండియన్ సిస్టమ్ ఆఫ్ మెడిసిన్(ఎన్‌సీఐఎస్‌ఎం) షరతులతో కూడిన అనుమతి ఇచ్చిందన్నారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ప్రవేశాల కోసం ఎన్‌సీఐఎస్‌ఎం తనిఖీలకు సహకరించిన ఆస్పత్రి సూపరింటెండెంట్, సిబ్బంది, ఫ్యాకల్టీ మెంబర్లు, కళాశాల సిబ్బంది, రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్ హరిచందనకు కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ ఆస్తులు పరిరక్షించాలి



సెక్రటరీకి మొక్కను అందజేస్తున్న తన్వీర్

న్యూశాయంపేట: వరంగల్ జిల్లాలో వక్ఫ్ ఆస్తులు పరిరక్షించడానికి చర్యలు తీసుకుని ముస్లింల సమస్యలు పరిష్కరించాలని వరంగల్ వక్ఫ్ ప్రాపర్టీస్ ప్రొటెక్షన్, డెవలప్‌మెంట్ కమిటీ, ముస్లిం ప్రతినిధి బృందం కోరింది. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నేతృత్వంలో హైదరాబాద్‌లో మైనారిటీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్‌ను కలిసింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ వరంగల్ ఫోర్ట్‌రోడ్ లోని ఈద్గా అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. కోటి 40 లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల విడుదలకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రోడ్డు, భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఈద్గా కమిటీ బాధ్యులు ఎం.ఏ.ఖాలీఖ్‌తన్వీర్, సాధిక్ అలీ, ఎం.ఎం. తహశీర్ తదితరులు పాల్గొన్నారు.

'ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటు కావు'

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) సర్వసభ్య సమావేశం చర్చలతోనే అర్ధాంతరంగా ముగిసిందని, ఏకపక్ష నిర్ణయాలు అకుట్ పరిధిలోనికి రావని అధ్యక్షుడు ఆచార్య తౌటం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి , ఉపాధ్యక్షురాలు ఆచార్య బ్రహ్మేశ్వరి, జాయింట్‌సెక్రటరీ కిశోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న జరిగిన అకుట్ సర్వసభ్య సమావేశంలో కొందరు అధ్యాపకులు నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నారని, అవి చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. సమావేశంలో తీసుకునే నిర్ణయాలకు పూర్తి కోరం అవసరమన్నారు. అందుకే ఏకపక్ష నిర్ణయాలు చెల్లుబాటుకావన్నారు.

పసుపు ధర పైపైకి..

- కేసముద్రం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.13,221
- వరంగల్‌లో రూ.13వేలు..



కేసముద్రం మార్కెట్‌కు వచ్చిన పసుపు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపుకు రికార్డుస్థాయిలో రూ.13,221 ధర పలికింది. మార్కెట్‌లో పసుపు సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.5 నుంచి 6వేల వరకు పలుకగా, నెల రోజుల నుంచి ధర క్రమక్రమంగా పెరుగుతూవస్తోంది. ఈ మేరకు బుధవారం మార్కెట్‌కు 56 బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపుకు గరిష్ట ధర రూ.13,221, కనిష్ట ధర రూ.8,651 పలుకగా, గోళారకం పసుపుకు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.11,752, కనిష్ట ధర రూ.6,509 పలికినట్లు మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. కాగా, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఏనుమాముల మార్కెట్‌లో రూ.13వేలు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పసుపు అత్యధికంగా క్వింటాల్‌కు రూ.13వేల ధర పలికింది. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన నూనె రాజయ్య మార్కెట్‌కు 20 బస్తాల పసుపు తీసుకొచ్చారు. పసుపు కాడి రకానికి క్వింటాల్‌కు రూ.13వేలు, గోళా రకానికి రూ.12600 పలకిందని యార్డు ఇన్‌చార్జ్ సాగర్ తెలిపారు. ఈ పసుపును జెకె.ఎంటర్‌ప్రైజెస్ నుంచి ఓసాయి ట్రేడర్స్ కొనుగోలు చేసినట్లు తెలిపారు.

మృతదేహం వెలికితీసి పోస్టుమార్టం

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొక్కలగడ్డ ఈద్గాలో బుధవారం ఉదయం గత నెల 12న పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం హనుమకొండ గుడిబండల్ ప్రాంతానికి చెందిన షహనజ్‌కు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. పెద్ద కుమార్తె కాజోల్ (20)వీణాబజార్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. కాజోల్ అంబాల గ్రామానికి చెందిన అబ్బాస్‌తో ఆరు సంవత్సరాల నుంచి సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో పెండ్లి విషయంలో కాజల్, అబ్బాస్‌కు గొడవలు జరిగాయి. ఇదిలా ఉండగా అనారోగ్య కారణాల రీత్యా గత నెల 12న కాజోల్‌ను ఎంజీఎంలో అడ్మిట్ చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే రోజు రాత్రి అబ్బాస్ బొక్కలగడ్డ ఈద్గాలో కాజోల్ మృతదేహం పూడ్చిపెట్టాడు. ఈ ఘటనపై మృతురాలి తండ్రి షహనజ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హనుమకొండ తహసీల్దార్ సమక్షంలో కేఎంసీ ఫోరెన్సిక్ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా నిందితుడిపై చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న ఒకరి మృతి

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం గ్రామానికి చెందిన తుపాకుల సూకాంబ్రం(60) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. సూకాంబ్రం మంగళవారం ఈత కొమ్మలు కోయడానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మొగిలిచర్ల బస్టాండ్ వద్ద వెనక నుంచి అతివేగంగా వచ్చిన కోళ్ల వ్యాన్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన ఆయనను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.



అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



రంజిత్‌కుమార్ (ఫైల్)

రాయపర్తి: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ చార్‌బౌళి ప్రాంతానికి చెందిన కాదర్ల రంజిత్‌కుమార్ (35) నగరంలో బంగారం షాపు నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం విరివిగా అప్పులు చేశాడు. తీర్చే మార్గం కనిపించక సోమవారం సాయంత్రం హనుమకొండ పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఎస్సారెస్పీ కాల్వలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం కాల్వలో రాయపర్తి మండల కేంద్రంలోని గుబ్బడిబోడుకిందితండాకి కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని కాల్వ నుంచి బయటకు తీసి రంజిత్‌కుమార్‌గా గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య సుష్మిత, పాప, బాబు ఉన్నట్లు తెలిపారు.

స్కూల్‌బస్సును ఢీకొట్టిన జెడ్పీ ఫ్లోర్‌లీడర్ స్వప్న వాహనం

- ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలు.. ఒకరిని వరంగల్‌కు రెఫర్
- సకాలంలో రాని 108 వాహనం.. రోడ్డు వెంట వాహనాలు ఆపి తరలించిన స్థానికులు
- జెడ్పీ ఫ్లోర్‌లీడర్‌కు తీవ్రగాయాలు కావడంతో మరో వాహనంలో హనుమకొండకు తరలింపు



ప్రమాదానికి గురైన కారు, బస్సు..



తీవ్రంగా గాయపడిన మహేష్



ప్రమాదంలో గాయపడిన చిన్నారులు

నర్సంపేట రూరల్ : ఆగి ఉన్న స్కూల్ వ్యాన్‌ను వరంగల్ జిల్లా జెడ్పీ ఫ్లోర్ లీడర్, నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్న వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. అందులో ఒకరిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు రెఫర్ చేశారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణ శివారులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణంలోని పాత్‌ఫైండర్ స్కూల్‌కు చెందిన ఇటుకాలపల్లి, నారక్కపేటకు రూట్ స్కూల్ బస్సు సాయంత్రం 5.20 గంటలకు 24 మంది పిల్లలతో బయలుదేరి వెళ్లింది. నారక్కపేట వైపు వెళ్లేందుకు 365 జాతీయ రహదారి వద్దకు చేరుకుంది. ముందు ద్విచక్రవాహనం ఉండడంతో డ్రైవర్ బస్సు నిలిపిఉంచారు. ఆ సమయంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి వరంగల్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న ఫార్చ్యూనర్ కారులో డ్రైవర్‌తో కలిసి ముత్తోజీపేట వైపు వేగంగా వస్తున్నాడు. ద్విచక్రవాహనాన్ని తప్పించపోయి కమలాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు వైపు తిప్పడంతో ఆ పక్కనే నిలిపివేసిన బస్సు వెనుకవైపు ఢీకొట్టారు. దీంతో బస్సు పల్టీ కొట్టే సమయంలో పక్కనే చెట్టు ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సులోని 19మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. పెద్ది స్వప్నకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. 108 వాహనం సకాలంలో రాకపోవడంతో జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనాలను ఆపి విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి 11మంది తరలించగా ముగ్గురికి తీవ్రగాయాలైన అన్విత్, కీర్తనలను ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన ఎం. మహేష్‌కు ప్రాథమిక చికిత్స నిర్వహించి వరంగల్‌కు రెఫర్ చేశారు. మరో 8మందిని నర్సంపేట పట్టణంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారిలో రిత్విక్, సహస్ర, నందు, దీక్షిత్‌లకు తీవ్రగాయాలు కాగా అడ్మిట్ చేశారు. మిగతావారికి చికిత్స అందించి తల్లిదండ్రులకు అప్పగించారు. నర్సంపేట ఏసీపీ తిరుమల్, టౌన్ సీఐ రవికుమార్, రూరల్ సీఐ కిషన్ ఆధ్వర్యంలో ప్రమాదంపై విచారణ జరుపుతున్నారు. గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని విద్యార్థి సంఘాల నాయకులు పోలీసులను కోరారు.

హనుమకొండకు పెద్ది స్వప్న తరలింపు

ప్రమాదంలో గాయపడిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను వెంటనే వేరే వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతున్నట్లు సమాచారం.